# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

గురువారం 3 మార్చి 2025 | www.prajaaswaramdaily.com | 2 pm




## మధ్యాహ్నం 3.30 గంటలకు నివేదిక ఇవ్వండి

### ప్రభుత్వం విక్రయించాలనుకున్న భూములు సందర్శించనున్న రిజిస్ట్రార్

### హెచ్ సీయూ భూముల కేసులో సుప్రీం కీలక ఆదేశాలు



ఢిల్లీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌కు అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు నివేదిక అందించాలని ఆదేశించింది. ప్రభుత్వం విక్రయించాలనుకున్న భూములను సందర్శించి నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రార్‌కు స్పష్టం చేసింది. 30 ఏళ్లుగా ఆ భూమి వివాదంలో ఉందని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అటవీ భూమి అని ఆధారాలు లేవని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వడం లేదని తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సుప్రీం పేర్కొంది.

## బీటెక్ విద్యార్థి అదృశ్యం.. దర్యాప్తులో పోలీసులు




మేడ్చల్: మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న అజితేష్ (20) అనే విద్యార్థి అదృశ్యం అయ్యాడు. వారాసిగూడలో ఉన్నటు వంటి స్నేహితుల దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పినట్లు అజితేష్ తండ్రి రామకృష్ణకి విద్యార్థి స్నేహితులు చెప్పారు. అజితేష్ సమాచారం తెలియకపోవడతో.. అజితేష్ తండ్రి ఈరోజు పోచారం పోలీసులకు పిర్యాదు చేశారు. తండ్రి పిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.

కరీంనగర్‌కి చెందిన అజితేష్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. పోచారంలోని యన్నంపేటలో స్నేహితులతో కలిసి అద్దె రూంలో ఉంటూ.. కళాశాలకు వెళ్తున్నాడు. మార్చి 23న కరీంనగర్‌కి వెళ్లిన అజితేష్.. 28న తిరిగి యన్నంపేటలోని రూంకి వచ్చాడు. 29న వారాసిగూడలో ఉంటున్న తన స్నేహితుడి వద్దకు వెళ్తాను అని ఇంట్లో, రూమ్ మెంట్స్ కి చెప్పి వెళ్ళాడు. తండ్రి రామకృష్ణ 29న సాయంత్రం అజితేష్ కి ఫోన్ చేయగా.. ఫోన్ స్విచ్ రావడంతో రూమ్ స్నేహితులను సంప్రదించాడు. వారాసిగూడ లో ఉన్నటువంటి స్నేహితుల దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పినట్లు అజితేష్ తండ్రికి వారు చెప్పారు. అజితేష్ సమాచారం తెలియకపోవడతో పోచారం పోలీసులకు గురువారం రామకృష్ణ చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి?

### స్పీకర్ కార్యదర్శి తరఫున న్యాయవాది సంఘ్వీని ప్రశ్నించిన జస్టిస్ గవాయ్

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంలో విచారణ

ఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగింది. తెలంగాణ స్పీకర్ కార్యదర్శి తరఫున న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. కౌశిక్‌రెడ్డి తరఫున ఆర్యామ సుందరం వాదించారు. అనంతరం ఇరు పక్షాల వాదనలను ముగించిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ 'మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి?' అని సింఘ్వీని ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందని.. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత వారి తీరు పూర్తిగా మారిపోతోందని వ్యాఖ్యానించారు

### తీర్పు రిజర్వు చేసిన సర్వోన్నత న్యాయ స్థానం



ఇటీవల అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి ప్రస్తావించారు. ''ఉప ఎన్నికలు రావు.. స్పీకర్ తరఫున కూడా చెబుతున్నా'' అంటూ ఆయన వ్యాఖ్యానించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని అన్నారని చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ ''సీఎం కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా? గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా?'' అని ప్రశ్నించారు.

మరోవైపు అభిషేక్ మనుసింఘ్వీ కలుగజేసుకుని ప్రతిపక్షం నుంచి అంతకుమించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతమని ధర్మాసనం వాటిని పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు ధిక్కారం కింద తీసుకోవాల్సి ఉంటుందని జస్టిస్ గవాయ్ అన్నారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూశారని సింఘ్వీ పేర్కొనగా.. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడి వరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అన్నారు.

# 25 వేల టీచర్ల నియామకాలు రద్దు

### అప్పటి వరకు అందుకున్న వేతనాలు, ఇతర భత్యాలు ఇవ్వాల్సిన అవసరం లేదు..

### దివ్యాంగ ఉపాధ్యాయులకు ఊరట.. విధుల్లో కొనసాగవచ్చని సుప్రీం వెల్లడి

### మమత బెనర్జీ సర్కారుకు ఎదురుదెబ్బ

**ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లపై దర్యాప్తు చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ 25వేల టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆ నియామకాలను రద్దు చేస్తూ గతంలో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం సమర్థించింది.**

దీనిపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం ఫిబ్రవరి 10న తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. తాజాగా తీర్పు వెలువరించింది. ఆ నియామక ప్రక్రియను కలుషితమైనది, కళంకమైనదిగా అభివర్ణించింది. హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సరైన కారణాలు లేవని పేర్కొంది. ఆ నియామకాలు చెల్లవని స్పష్టంచేసింది. అయితే, ప్రభావిత ఉపాధ్యాయులకు కాస్త ఊరట కల్పించింది. ఈ నియామక ప్రక్రియ కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు అప్పటివరకు అందుకున్న వేతనాలు, ఇతర భత్యాలను తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడించింది.

ఇక, మూడు నెలల్లో కొత్తగా టీచర్ల నియామకాలు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, దివ్యాంగ ఉపాధ్యాయులకు మానవతా కోణంలో ఊరట కల్పించింది. వారు విధుల్లో కొనసాగొచ్చని స్పష్టంచేసింది. ఇక, ఈ కుంభకోణం వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరపాలని గతంలో హైకోర్టు సీబీఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ దీదీ సర్కారు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 4న విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది.

ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.



# మూడేళ్లలో అధికారంలోకి వస్తాం 400 ఎకరాలు రిటర్న్ తీసుకుంటాం

### ఎవరు కొన్నా నష్టపోతారు: కేటీఆర్

**రంగారెడ్డి : మూడేళ్లలో మరలా అధికారంలోకి వస్తామని, హెచ్ సీయూ కు చెందిన 400 ఎకరాలు తిరిగి రిటర్న్ తీసుకుంటామని మాజీమంత్రి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. హెచ్‌సీయూ భూములము ఎవరు కొన్నా నష్టపోతారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.**

'ప్రజల సొమ్మును రక్షించాల్సిన మీరు ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అయితే దొంగ లాగా ఎందుకు పోతున్నారు. పది రోజుల సమయం అడిగిన మీరు.. ఎందుకు అంత తొందరగా బుల్డోజర్‌లు పంపించారు. సెలవులు చూసుకొని వెళ్లి చెట్లు కూల్చుతున్నారు. పేరుకే ప్రజాపాలన, ఎక్కడా కూడా ప్రజాస్ఫూర్తి లేదు. పశ్చిమ హైదరాబాద్‌లో కేవలం 2500 ఎకరాలు మాత్రమే ఉంది. దీనిని ఎందుకు పాడు చేస్తున్నారు. ఈ విషయంపై కేసీఆర్ హైదరాబాద్ నాయకులతో చర్చించారు. హైదరాబాద్‌కు మేము చేసిన ఎఫర్ట్స్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. కోట్ల మొక్కలు నాటి హరిత విప్లవానికి తెర లేపాం. అప్పుడు హైదరాబాద్‌కు గ్రీన్ సిటీ అవార్డ్ వచ్చింది. మా హయాంలో దేశంలో అన్ని రాష్ట్రాలలో ... తెలంగాణలో గ్రీన్ కవర్ పెరిగింది. అందుకే పార్టీ ఒక నిర్ణయం తీసుకుంది. మూడేళ్ల లో మరలా అధికారంలోకి వస్తాం. రాగానే ఆ 400 ఎకరాలు తిరిగి రిటర్న్ తీసుకుంటాం. ఆ 400 ఎకరాల్లో ఎకో పార్కు ఏర్పాటు చేస్తాం. ఆ భూములు ఎవరు కొనుకున్నా నష్టపోతారు. ముందే చెబుతున్నాం, తర్వాత ఎవరూ మమ్మల్ని అడగొద్దు' అని కేటీఆర్ హెచ్చరించారు.

**'మేము అధికారం లో ఉన్నప్పుడు రోహిత్ వేముల విషయంలో హెచ్‌సీయూకి రాహుల్ గాంధీ వస్తే మేం ఎస్కార్ట్ ఇచ్చాం. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఎలా చేస్తుంది చూడండి. రాహుల్ గాంధీ ఒకసారి మీ ప్రభుత్వానికి చెప్పండి, దేశం అంతా కోడై కూస్తున్నా ముఖ్యమంత్రికి కనిపించడం లేదు. మరోసారి చెబుతున్నాం, ఈ ల్యాండ్ కోసం ఎవరూ కూడా వేలంలో పాల్గొనకండి. ఇది హైదరాబాద్ ప్రజల అస్థి. ఈ 400 ఎకరాలు కాపాడే బాధ్యత మాది. మంత్రులకు విషయం తెలియక మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి దగ్గర మెప్పు కోసం, 20-30 శాతంల కోసం మాట్లాడుతున్నారు. బండి సంజయ్ ఐటమ్ నంబర్ సిక్స్. కేంద్ర ప్రభుత్వంలో ఉండే వాళ్ళు ఏమి మాట్లాడుతున్నారో చూసుకోవాలి. తంబాకు తింటూ తిరిగితే బండి సంజయ్ కు ఏమి తెలుస్తుంది' అని కేటీఆర్ విమర్శలు చేశారు.**

# సెక్రటేరియెట్ ముట్టడి ఉద్రిక్తం



హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాలు యత్నించాయి. హెచ్‌సీయూ భూములను కాపాడాలంటూ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు.

### హెచ్‌సీయూ వద్ద ఏబీవీపీ ఆందోళన

మరోవైపు హెచ్‌సీయూ వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసనకారులు ఆందోళనకు దిగారు. లోపల జరుగుతున్న పనులను అడ్డుకుంటామన్నారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత వాతావరణంలో నెలకొంది. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడ మోహరించారు.

# కేబినెట్ విస్తరణలో ఇబ్బందులు

### టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

### కేసీఆర్ హయాంలో జరిగిన భూ అక్రమాలపై చర్చకు సిద్ధం

### మూడేళ్లలో అధికారం కలే.. కేటీఆర్‌వి పగటి కలలు



హైదరాబాద్ : ప్రస్తుతం జరగాల్సిన మంత్రివర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని టీపీసీసీ నేత మహేష్ గౌడ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ బీసీ గర్జనకు హాజరవుతారని కాంగ్రెస్ ఎప్పుడు ప్రకటించలేదని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లుతో సంబంధం ఉన్న అంశాల కారణంగా ఈ కార్యక్రమానికి రాలేకపోయారని తెలిపారు. అయితే, బీసీ రిజర్వేషన్ల అంశంపై పూర్తి మద్దతు ఇస్తారని హామీ ఇచ్చారు. అలాగే హెచ్‌సీయూ భూములపై ఇవి ప్రభుత్వానికి చెందినవేనని, ఇది కోర్టు పరిధిలో ఉన్న అంశమని తెలిపారు. విద్యా సంస్థల అవసరాల కోసమే ఈ భూములను వినియోగించుకుంటామని స్పష్టం చేశారు.

కేసీఆర్ హయాంలో జరిగిన భూ అక్రమాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అవి నిరూపించగలమని అన్నారు. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణకు గురైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా తీసుకువచ్చామని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ అడ్డుపడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ రెండు పార్టీలే ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

హెచ్‌సీయూ భూముల నుంచే మై హోమ్‌కు వంద అడుగుల రోడ్డు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఇది ఎలా జరిగిందో తమకు అనుమానం ఉందని, దానిపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. మూడేళ్లలో తాము అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నాడు అంటూ వ్యాఖ్యానించారు. .